(పక్క పేజీ తరువాయి)

# గిరిజన మహిళ ఒంటరి కాదు

– 'శక్తి' సంస్థ శారదాదేవి

అడవుల్లో ఏదో మారుమూల గ్రామాల్లో సభ్య సమాజానికి దూరంగా వుండే ఎందరో గిరిజనులు ఇప్పటికీ తమ గ్రామ పొలిమేర్లు వదిలి బయటకు రారు. గ్రామ సరిహద్దుల్లోనే పోడు వ్యవసాయం చేసుకుంటూనో, పొలం పనుల్లో నిమగ్నమయ్యో వుంటారు. ఇలాంటి స్థితిలో ఇతర ఊళ్ళ నుండి వచ్చి దగాచేసిన వారి గురించి ఎవరికి చెప్పుకోవాలని, తమకు జరిగిన అన్యాయాన్ని గురించి ఎవరికి విన్నవించుకోవాలి అనే ఆవేదనతోనే సంవత్సరాలు గడిచిపోయాయి.



ప్రస్తుతం వారికొక చిరునామా దొరికింది. అదే 'శక్తి' స్వచ్ఛంద సేవా సంస్థ. ఆ సంస్థ నిర్వాహకురాలు శ్రీమతి శారద శివరామకృష్ణ తన భర్త డాక్టర్ పి.శివరామకృష్ణ బాటలోనే స్వచ్ఛంద సంస్థ నిర్వహణ చేపట్టారు.

ఏజెన్సీ ప్రాంతంలో కేవలం ప్రభుత్వ పథకాల వలనే గిరిజనులు చైతన్యం కారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు సైతం అవసరమని ఎందరో మేధావులు గుర్తించారు. గిరిజనుల కోసం గత అనేక సంవత్సరాలుగా పోరాడుతున్న 'శక్తి' దగాపడిన గిరిజన మహిళల పక్షాన కోర్టులో కేసులు నడుపుతుంది.

గిరిజన మహిళలకు అండగా నిలుస్తున్న శ్రీమతి శారదాదేవి కోర్టులో జరుగుతున్న జాప్యం వల్ల నిరుత్సాహ పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. ఆమెతో జరిపిన ఇంటర్వ్యూలో కొన్ని ముఖ్యాంశాలు.

ప్రశ్న: గిరిజన మహిళ ప్రధానంగా ఎందుకు మోసపోతుంది?

జవాబు: గిరిజన ప్రాంతాల్లో సరైన విద్యా సదుపాయాలు లేవు. అందువల్ల గిరిజన మహిళలు ఎక్కువమంది నిరక్షరాస్యులుగా వుంటున్నారు. అమాయకంగా నమ్మే ఆమె స్వభావం ఆమెను దగా అయ్యేలా చేస్తుంది. గిరిజన మహిళల్ని అక్షరాస్యులు చేసి, మోసాలు ఎలా జరుగుతాయో వివరిస్తే ఎంతో మేలు జరుగుతుంది.

ప్రశ్న: దగాపడిన గిరిజన మహిళలు కోర్టుల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఏమిటి?

జవాబు: న్యాయస్థానాల్లో కోర్టు భాష ఆమెకు పెద్ద సమస్య. నిరక్షరాస్యులైన ఆమె తర్జన భర్జనల్లో ఉక్కిరి, బిక్కిరి అవుతుంది. అసలు కోర్టుకు వచ్చిన మహిళలు ప్రాథమిక దశలోనే రెండు సంవత్సరాలు కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఒక కేసు పూర్తిగా పరిష్కారం అయ్యేసరికి కనీసం 10 సంవత్సరాలు పడుతుంది. ఇంతా చేసి కోర్టులో గెల్చినా, భరణం ఇవ్వకపోయినా ఆమె ఏమీ చెయ్యలేదు. భరణం ఇవ్వడంలేదని కేసు పెడితే, అతను జైల్లో వున్న రోజులుకు భోజనం మహిళే భరించాలి. ఇదంతా చూసి కోర్టుకు రావాలి అంటే ముందు వున్న ఉత్సాహం తరువాత వుండడం లేదు.

ప్రశ్న: ఈ పరిస్థితుల్లో మహిళలకు న్యాయం చేయాలి అంటే ఏమి చేయాలి?

జవాబు: సత్వరమే కోర్టు తీర్పు వస్తే ఎక్కువ ఉపయోగం వుంటుంది. నా వద్దకు వంద కేసులు వచ్చాయి. కాని ఏం చెయ్యను?

ప్రశ్న: గిరిజన మహిళలకు మీ సంస్థ ఏమి చేస్తుంది?

జవాబు: నీవు ఒంటరిగా లేవు అనే ధైర్యం చెబుతుంది. ఎలా పోరాడాలో నేర్పిస్తుంది.